క్లుప్తంగా

కందులాపురంలో వీధిలైట్లు ఏర్పాటు


స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు

సాక్షి ఎఫెక్ట్..

కంభం: స్థానిక కందులాపురం పంచాయతీ పరిధిలోని పూసల బజారులో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయమై ఆదివారం 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కరించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి 'పొలం పిలుస్తోంది'

రాచర్ల: మండలంలో మంగళవారం నుంచి 31వ తేదీ వరకు ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్ తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పంటల యాజమాన్యంలో రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. మంగళవారం గంగంపల్లె, అనుమలవీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్

మార్కాపురం: ఈనెల 24, 25వ తేదీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ మద్దిన జాహ్నవి ప్రియ తెలిపారు. క్రీడా పోటీల్లో భాగంగా మొదటి రోజు మంగళవారం అథ్లెటిక్స్, యోగా, చెస్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 25వ తేదీ బుధవారం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. నియోజవకర్గంలోని అన్ని మండలాల్లో గెలుపొందిన క్రీడాకారులకు(అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలకు) రెండురోజులపాటు పోటీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు తమ క్రీడాకారులతో హాజరుకావాలని సూచించారు.

ఉర్దూ విద్యార్థులకు టెట్ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ అందుకుంటున్న విద్యార్థులు


కంభం: ఉర్దూ విద్యార్థులకు ఉచితంగా టెట్ మెటీరియల్ అందించడంతోపాటు శిక్షణ ఇచ్చినట్లు అర్ధవీడు ఎంఈఓ, కో ఆర్డినేటర్ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎన్ఎస్)లో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఉర్దూ మీడియం చదువుతున్న 50 మంది శిక్షణకు హాజరయ్యారు. ఉర్దూ ఉపాధ్యాయులు హబీబుర్ రహమాన్‌ఖాన్, సయ్యద్ షఫీ, రఫీ, ఆరీఫ్‌ఖాన్, సలీంబాషా, దాదా తదితరులు పాల్గొన్నారు.

29న 'టెట్' మోడల్ పరీక్ష

పొదిలి: యూటీఎఫ్, డీవైఎఫ్ఐ, టీచర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన టెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.బాలవెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఈ పరీక్షను కొనకనమిట్ల, పొదిలి, మర్రిపూడిలో టెట్ అభ్యర్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

మార్కాపురం చెరువుకు మోక్షమెప్పుడో?


కొద్దిపాటి నీరున్న మార్కాపురం చెరువు


గుర్రపుడెక్క చిల్లచెట్లతో మూసుకుపోయిన కాలువ

- పూడుకుపోయిన చెరువు కాలువలు
- ఈ ఏడాది చెరువు కింద ఆయకట్టు సాగు శూన్యం
- గత ప్రభుత్వంలో 15 కి.మీ కాలువ బాగు చేసినా సమస్య మళ్లీ మొదటికి..
- చెరువు, కాలువలు బాగు చేయాలని రైతుల వినతి

మార్కాపురం:

శతాబ్దాల చరిత్ర కలిగిన మార్కాపురం చెరువు రోజురోజుకూ పూడుకుపోతోంది. పట్టణంలో ఉండే చెత్తా చెదారం, గుర్రపుడెక్క ఆకుతో అటు కాలువలు, ఇటు చెరువు పూడిపోయి పల్లెంలా తయారైంది. సుమారు 25 ఏళ్ల క్రితం 15 అడుగుల లోతున ఉన్న చెరువు, ప్రస్తుతం 5 అడుగులకు వచ్చింది. అధికారికంగా చెరువు కింద సుమారు 2 వేల ఎకరాలు ఆయకట్టు ఉండగా, అనధికారంగా మరో వెయ్యి ఎకరాలు సాగు చేస్తారు. గతేడాది కొంత మంది రైతులు చెరువులో ఉన్న నీటిని వినియోగించుకుని వివిధ రకాల పంటలు పండించారు. ఈ ఏడాది చెరువుకు సరిపడినంత నీరు చేరకపోవడంతో ఆయకట్టు సాగు ప్రశ్నార్థకమైంది. మార్కాపురం చెరువులో నీరుంటే రైతులు వరి సాగు చేసేవారు. కానీ ఈ సారి మెట్టపంటలు కూడా సాగు కాలేదు. మార్కాపురం చెరువులో నీళ్లుంటేనే పట్టణంలో డీప్ బోర్లు రీచార్జ్ అయి నీరు వస్తాయి.

సమస్య మళ్లీ మొదటికి..

కంభం చెరువు నుంచి వచ్చే నీరు మార్కాపురం మండలం మాల్యవంతునిపాడు వద్ద రెండు పాయలుగా చీలుతుంది. ఒక కాలువ మార్కాపురం చెరువుకు, మరో కాలువ గుండ్లకమ్మతోపాటు వేములకోట చెరువుకు వెళ్తుంది. సుమారు 15 కిలోమీటర్లు ఉన్న కాలువను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిధులు వెచ్చించి బాగు చేయించారు. అయితే ఇటీవల వచ్చిన వర్షాలకు కాలువలో చెత్తాచెదారం చేరడం, గుర్రపు డెక్క పెరిగిపోవడంతో కాలువలు పూడిపోయి, నీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. దీంతో వరద నీరంతా గుండ్లకమ్మలో చేరి వృథాగా సముద్రంలో కలిసిపోయింది. మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన రాయవరం, మేకలవారిపల్లి, చెన్నరాయునిపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు తమ పాత ఇళ్లు పడగొట్టి కొత్తఇల్లుకట్టే సమయంలో ఆ వ్యర్థాలను చెరువు అంతర్భాగంలో తెచ్చి పోస్తున్నారు. దీంతోపాటు జంతు కళేబరాలు, ఇళ్ల నుంచి వచ్చే చెత్తను సప్లయ్ చానల్, కాలువల్లో పడేస్తున్నారు. ఫలితంగా చెరువుకు నీరు చేరడం కష్టమై సాగు ప్రశ్నార్థకంగా మారింది. మాల్యవంతునిపాడు నుంచి వచ్చే చెరువు సప్లయ్ చానల్ వెంట పలువురు ఇళ్లు నిర్మించడంతో క్రమక్రమంగా కాలువ కుంచించుకుపోయింది. కాలువకు ఇరువైపులా భారీగా చిల్లచెట్లు, తుమ్మచెట్లు మొలిచాయి. నీటి పారుదలశాఖ అధికారులు స్పందించి కాలువలతోపాటు చెరువులో మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పౌరులందరికీ సమాచారం పొందే హక్కు


కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఏఓ ప్రసన్న రంగలక్ష్మి


మాట్లాడుతున్న ఏఓ జక్కం మెర్సీ


పొదిలిలో మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి


తర్లుపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బేస్తవారిపేట: సమాచార హక్కు చట్టం కింద ప్రతి పౌరుడికీ ప్రభుత్వ కార్యాలయంలో అవసరమైన సమాచారం పొందే హక్కు ఉందని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పత్రాలను తనిఖీ చేయడం, రికార్డుల్లో ఉన్న సమాచారాన్ని చూడటం, వాటి నకలు, సర్టిఫైడ్ కాపీలు పొందడం, ఫ్లాపీలు, డిస్కులు, టేపులు, వీడియో క్యాసెట్ల రూపంలో, ఇతర ఎలక్ట్రానిక్ రూపంలో సమాచారాన్ని పొందవచ్చని వివరించారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడం, అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ విభాగాలు ప్రజలకు జవాబుదారీ ఉండటం కోసం సమాచార హక్కు చట్టం -2005ను ప్రవేశపెట్టారని తెలిపారు. దరఖాస్తు కోసం నిర్దిష్ట నమూనా ఏమీ ఉండదని, తెల్లకాగితంపై చేతితో రాసి, టైప్ చేసి కానీ సమాచారం కోరవచ్చని తెలిపారు. ఇందుకుగాను దరఖాస్తుదారుడు రూ.10 రుసుం చెల్లించాలన్నారు. బీపీఎల్ కేటగిరీవారు ఏమీ చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. కోరిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందించాల్సి ఉంటుందని, అలా చేయని పక్షంలో అప్పీలుకు వెళ్లేందుకు అవకాశం పౌరులకు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు చెన్నకేశవరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

కొనకనమిట్ల: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కొనకనమిట్ల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయంలో సమాచారం పొందడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. ఎంపీడీఓ, వెటర్నరీ డాక్టర్, రెవెన్యూ సూపరింటెండెంట్, పంచాయతీ సెక్రటరీలు, వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుధామారుతి పేర్కొన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. త్వరలో గ్రామ స్థాయి నుంచి సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి అవినీతి రూపుమాపడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎస్కే జైనలాబ్దిన్, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తర్లుపాడు: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం తర్లుపాడులో మండల స్థాయి అధికారులు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఏఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టంలోని పలు సెక్షన్ల గురించి తెలిపారు. ఏపీఓ పిచ్చయ్య, సీసీ సాయిలు, వలి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులకు అభినందన


బేస్తవారిపేట : క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో సత్తాచాటారు. ఈనెల 21, 22వ తేదీల్లో గిద్దలూరులో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపరచారు. బీవీ రవీంద్ర 100 మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్, ట్రిపుల్‌జంప్ పోటీల్లో మొదటి స్థానం, ఎన్.రవితేజ 200, 1500 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ, జె.మురళీకృష్ణ ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. గెలుపొందిన విద్యార్థులను, పీడీ మధుసూదనచార్యులును పాఠశాల హెచ్ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

వైద్య శిబిరాలు ఉపయోగించుకోండి


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మార్కాపురం: వైద్య శిబిరాలను ప్రజలు ఉపయోగించుకోవాలని మార్కాపురం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సావిత్రి సూచించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సోమవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జనరల్ మెడిసిన్, జనరల్ ఫిజీషియన్, ఎముకలు, కళ్లు, చెవి, గొంతు, ముక్కు, చర్మవ్యాధులకు సంబంధించిన వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.రామారావు, మధుకిరణ్, వసంతకుమారి, మనోరంజన్, వంశీకృష్ణ, రామచంద్రరావు, జి.లక్ష్మీ ప్రసన్న, ఎస్కే మౌలాలి, ఫార్మసిస్టు హబీబ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సేవలు


జైలులో సూచనలిస్తున్న సీనియర్ జడ్జి శ్యాంబాబు

గిద్దలూరు రూరల్: ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని పొందే అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఒంగోలు సీనియర్ సివిల్ జడ్జి కె. శ్యాంబాబు తెలిపారు. సోమవారం గిద్దలూరులోని సబ్‌జైలును ఆయన సందర్శించారు. ఉచిత న్యాయ సహాయం పొందడానికి గల అర్హతలను వివరించారు. వారికి బెయిల్ అప్లికేషన్ వేసుకునే హక్కు ఉందన్నారు. సబ్ జైల్లో ఖైదీలకు అందుతున్న సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. జైలు న్యాయ సహాయ క్లినిక్ ద్వారా, న్యాయవాది ద్వారా సమస్యలు తెలియజేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, అహల్య, మధుసూదనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దరిమడుగు విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం రూరల్: మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో దరిమడుగు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-14 హైజంప్‌లో జె.శ్రీను, అండర్-17 జావెలిన్ త్రోలో ప్రవీణ్‌కుమార్, ఎం.రుద్ర, షటిల్ బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో కె.రాజేష్, డి.నాగచైతన్య, అండర్-14 బాయ్స్ విభాగంలో గణేష్, అండర్-17లో జె.నిఖిల్, నాగులు, మరికొందరు ప్రతిభ చాటారు. పాఠశాల పీఈటీ బాబూరావును, గెలుపొందిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం తిరుపతిరెడ్డి అభినందించారు.

మార్కాపురంలో మోస్తరు వర్షం


మార్కాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

మార్కాపురం: మార్కాపురం పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలు, పంటలు సాగు చేసిన రైతులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. గత వారంరోజులుగా 38, 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. సెప్టెంబర్ నెలలో కూడా వేడి అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. ఈ తరుణంలో వర్షం కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వారం రోజుల నుంచి వర్షం కోసం ఎదురుచూస్తున్న పత్తి, మిర్చి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

రాచర్ల మండలంలో మోస్తరు వర్షం

రాచర్ల: మండలంలోని రాచర్ల, గౌతవరం, అనుమలవీడు గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. గడిచిన వారం రోజులుగా ఎండలు మండుతుండటంతో పంట పొలాలు వాడుముఖం పట్టాయి. ప్రస్తుతం కురిసిన వర్షంతో పొగాకు, కంది, మిరప, పత్తి పంటలకు మేలు కలుగుతుందని రైతులు భావిస్తున్నారు.

స్వేచ్ఛ మనిషికి హాని కలిగించేలా ఉండరాదు


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

కంభం: స్వేచ్ఛ మానవులకు అవసరమే కానీ అది సమాజానికి హాని కలిగించేలా ఉండకూడదని జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆఫీరా పేర్కొన్నారు. నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో జమాఅతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో వాల్ పోస్టర్లు ఆవిష్కరించి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫీరా మాట్లాడుతూ.. నేటి సమాజంలో యువతీ యువకులు నగ్నత్వం, జూదం, మద్యం, మద్యం, మాదక ద్రవ్యాలు, సహజీవన సంబంధాలు, స్వలింగ సంపర్కం, వ్యభిచారం లాంటి వాటికి ఆకర్షితులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తమ సంస్థ ద్వారా యువతీ యువకులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీమున్నిసా, సాబిహా, అజీమా, తబస్సుమ్, మహబున్నీ,నసీమా,రమీజా, ఫర్జానా పాల్గొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి అధికారులు డుమ్మా


కొమరోలులో మీ కోసం కార్యక్రమానికి హాజరైన అధికారులు

కొమరోలు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరాశగా వెనుదిరిగారు. మీ కోసం కార్యక్రమానికి కేవలం ముగ్గురు లేదా నలుగురు అధికారులే హాజరు కావడం, మిగిలిన శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, హౌసింగ్ అధికారి మాత్రమే సోమవారం మీ కోసం కార్యక్రమానికి హాజరయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి మీ కోసం కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెన్నకేశవస్వామి హుండీ ఆదాయం రూ.10.68 లక్షలు


హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి హుండీ కానుకల రూపంలో రూ.10,68,797 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు సోమవారం తెలిపారు. చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారి హుండీల ద్వారా 4 నెలల 13 రోజులకుగాను ఈ ఆదాయం వచ్చినట్లు వివరించారు. హుండీ లెక్కించేందుకు మహిళా భక్తులు, ఆలయ సిబ్బంది సహకరించారని అధికారులు తెలిపారు.

బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలి


సంఘీభావం తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

బేస్తవారిపేట: బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలని మాలమహానాడు జాతీయ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి అన్నారు. సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా బేస్తవారిపేటలోని మాలమహానాడు కార్యాలయంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా అడ్డుకుంటామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగానికి లోబడి ఉండాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా అంబేడ్కర్ కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదమ్ముళ్ల మధ్యన చిచ్చుపెట్టి రిజర్వేషన్లను రద్దు చేసే కుట్రలో భాగంగానే వర్గీకరణ, క్రిమిలేయర్ తీర్పులు వెలువడ్డాయని తెలిపారు. బీజేపీ కుట్రలను దళితులు అర్థం చేసుకోవాలన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని కోరారు. మాలమహానాడు జిల్లా నాయకుడు మంచా సాయి, సేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పోలు, నియోజకవర్గ అధ్యక్షుడు సురేష్‌బాబు, మండల నాయకులు అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీకి 35 మంది విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజబాబు తదితరులు

మార్కాపురం టౌన్: డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ సెలక్షన్‌లో 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ ఏఎన్‌ఓ 186 యూనిట్ కెప్టెన్ అనీల్ నేతృత్వంలో 2024-25 విద్యాసంవత్సరానికి సెలక్షన్ నిర్వహించారు. మొత్తం 100 మంది విద్యార్థులు సెలక్షన్‌కు హాజరుకాగా 35 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. వీరిలో 27 మంది విద్యార్థులు, 8 మంది విద్యార్థినులు ఉన్నట్లు వివరించారు. కమాండింగ్ ఆఫీసర్ మోహన్, ఆంధ్రా బెటాలియన్ అధికారులు సత్యనారాయణ్, సిబ్బంది పుష్పరాజ్, అకడమిక్ డీన్ మస్తానయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా జీవన్ కుమార్

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా జీవన్ కుమార్ నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు సోమవారం జారీ అయ్యాయి. ఇంత కాలం పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా విధులు నిర్వహించిన విశ్వేశ్వరరావు మంగళగిరి హెడ్ క్వార్టర్‌లోని జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం అధికారిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గిద్దలూరు డివిజన్ పరిధిలోని గుండ్లకమ్మ ప్రాజెక్టు టైగర్‌లో రేంజి అధికారిగా విధులు నిర్వహిస్తున్న జీవన్ కుమార్‌ను పెద్దదోర్నాల ఫారెస్టు రేంజి అధికారిగా బదిలీ చేశారు.